మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ  ఎడిటర్ : నంద కిషోర్  సంపుటి : 08  సంచిక : 117  మంగళవారం  14 - 10 - 2025  పేజీలు: 8  వెల: 4

## కల్తీ మద్యాన్ని అరికట్టాలి




4లో..



### ప్రధాని మోడీ రాకతో కర్నూలుకు

# దేశ వ్యాప్తంగా గుర్తింపు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు, మంత్రి టీజీ భరత్
- సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ సభపై కర్నూలు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం

మన గళం, కర్నూలు : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కర్నూలుకు వస్తున్న సందర్భంగా దేశవ్యాప్తంగా అందరి చూపు కర్నూలుపై ఉంటుందని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు వల్ల శ్రీనివాసరావు, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూల్ నగరంలోని ఎం.ఆర్.సి ఫంక్షన్ హాల్ లో కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బూత్ లెవెల్ కార్యకర్తలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లతో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావు, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, నాగేశ్వర రావు యాదవ్, జనసేన నాయకుడు అర్షద్, బీజేపీ నాయకుడు సూర్య, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ బహిరంగ సభ విజయవంతం అవుతుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. సభకు ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. జీఎస్టీ సంస్కరణల వల్ల పేదలకు లాభం కలుగుతుందని చెప్పారు. కర్నూలు జిల్లాను ఇండస్ట్రియల్ హబ్‌గా చేస్తున్నామని చెప్పారు. ప్రధాని రాకతో కర్నూలు దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నారు. పెట్టుబడిదారులు ఇక్కడికి తరలివస్తారని అన్నారు. ఇందుకు నాయకులు అందరూ సహకరించాలని.. సభను సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు.

అనంతరం మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ జివిస్టి సంస్కరణల గురించి పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేయాలని చెప్పారు. 16వ తేదీన జరిగే మోడీ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇంట్లో పండుగ అనుకొని ప్రతి ఒక్కరూ సభకు తరలి రావాలని ఆయన చెప్పారు. తమ ప్రభుత్వంలో కర్నూలుకు 10 వేల కోట్ల రూపాయల

2 లో..



### ప్రధాని మోడీ పర్యటన

## ఏర్పాట్ల పరిశీలన

మనగళం, కర్నూలు సిటీ : ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 16న కర్నూలులో పర్యటిస్తున్న నేపథ్యంలో సోమవారం ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఏపీఈ అండ్ డబ్ల్యూఐడీసీ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర పరిశీలించారు. నన్నూరు రాగమయూరి గ్రీన్ హిల్స్ వద్ద ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ ప్రాంగణాన్ని వారు పరిశీలించారు. సభ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్ పై ప్రధాని ప్రసంగిస్తారని, ప్రజలు భారీగా తరలివస్తారని, ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని ఈ సందర్భంగా వారు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్ర మౌళి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రధాని సభను

## విజయవంతం చేద్దాం



\- మంత్రి టీజీ భరత్

మనగళం, కర్నూలు సిటీ : అనంతపూర్ నుండి కర్నూలు వరకు ఇండస్ట్రియల్ కారిడార్ గా అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 16వ తేదీన ప్రధాని పర్యటనను ప్రజలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కర్నూలుకు ప్రధాని మోదీ వస్తున్నందున చాలా అంచనాలున్నాయన్నారు. నాటి రాజధాని అయిన కర్నూలుపై ప్రధాని మోదీకి అవగాహన ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వెనుకబడిన ప్రాంతమైన కర్నూలుకి ప్రధాని మోదీ ఏమైనా వరం ప్రకటిస్తారా అన్న ఆశ ప్రజల్లో ఉందన్నారు. ఇక తమ కూటమి ప్రభుత్వం అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వలన ప్రజలకు చాలా మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు

### ప్రధాని మోడీ పర్యటనను

## విజయవంతం చేద్దాం

\- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



మనగళం, కర్నూలు సిటీ : నంద్యాల జిల్లాలో ఈ నెల 16 వ తేదీ గురువారం ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేద్దామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ అష్టాదశ శక్తి పీఠం, ద్వాదశ జ్యోతిర్లింగం రెండూ ఒకేచోట ఉంటూ

2 లో..

### కమాండ్ కంట్రోల్ రూమ్

## సమర్థవంతంగా పని చేయాలి

\- ప్రధాని ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ వీర పాండియన్



మనగళం, కర్నూలు సిటీ : కమాండ్ కంట్రోల్ రూమ్ సమర్థవంతంగా పని చేయాలని ప్రధాన మంత్రి మోడీ ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ వీర పాండియన్ తెలిపారు. ప్రధాని ఈ నెల 16న కర్నూలు రానున్న నేపథ్యంలో సోమవారం నన్నూరు రాగమయూరి గ్రీన్ హిల్స్ వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం పని తీరుపై ఆయన జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి, ఐఏఎస్ అధికారి విజయ సునీత, దినేష్, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ట్రైనీ కలెక్టర్

2 లో..



### పాకిస్థాన్ లాహోర్‌లో

## హింసాత్మక ఉద్రిక్తతలు

- లాహోర్ రణరంగం.. టీఎల్‌పీ నిరసన హింసాత్మకం
- పోలీస్ అధికారితో పాటు పలు నిరసనకారుల మృతి, పరిస్థితి ఉత్కంఠ

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్‌లో మరోసారి హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. లాహోర్ నగరంలో టీఎల్‌పీ (తెహ్రీక్ ఎ లబ్బైక్ పాకిస్థాన్) పార్టీ చేపట్టిన నిరసన ర్యాలీ అదుపు తప్పి రణరంగాన్ని తలపించింది. ఈ ఘర్షణల్లో ఒక పోలీస్ అధికారి ప్రాణాలు కోల్పోగా,

2 లో..

### కెనడాతో సంబంధాల

## బలోపేతంపై చర్చలు



\- వాణిజ్యం నుంచి సాంకేతికత వరకు

మన గళం, న్యూఢిల్లీ : భారత ప్రతినిధి బృందం కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్‌ను ఆహ్వానిస్తూ కీలక చర్చలు జరిపింది. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలు, సాంకేతిక రంగంలో భాగస్వామ్యం, శక్తి వనరుల మార్పిడి, వ్యవసాయ సహకారం, ప్రజల మధ్య అనుబంధాన్ని మెరుగుపరచే అంశాలపై విస్తృతంగా చర్చించుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. కెనడాతో ఉన్న సంబంధాలను మరింత

2 లో..

### అయోధ్యలో చిన్న వ్యాపారులపై

## అమానుష ప్రవర్తన



\- కాంగ్రెస్ విమర్శ

మన గళం, న్యూఢిల్లీ : అయోధ్యలో స్థానిక మున్సిపల్ అధికారులు చిన్న వ్యాపారులైన తెప్పచేలు, చిల్లర విక్రేతలపై చేసిన ప్రవర్తన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ పార్టీ ఆరోపణల ప్రకారం, మున్సిపల్ సిబ్బంది వారిని

2 లో..

### దుర్గాపూర్‌లో మెడికల్

## విద్యార్థినిపై దారుణం



మన గళం డెస్క్ : పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో మెడికల్ విద్యార్థినిపై జరిగిన ఘోర ఘటన రాష్ట్రాన్ని కుదిపేసింది. ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సెకండియర్ చదువుతున్న 23 ఏళ్ల యువతిపై శుక్రవారం రాత్రి కొందరు యువకులు గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డారు. బాధితురాలు తన

2 లో..

# పాకిస్థాన్ లాహోర్‌లో హింసాత్మక ఉద్రిక్తతలు



పలు నిరసనకారులు కూడా మృతి చెందినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. కాల్పులు, రాళ్ల దాడులు, బాణాసంచా పేలుళ్లతో నగరం మొత్తం గందరగోళానికి గురైంది. ఇజ్రాయెల్ చర్యలను ఖండిస్తూ, పాలస్తీనాకు మద్దతుగా అమెరికా రాయబార కార్యాలయం వైపు లాంగ్ మార్చ్‌గా టీఎల్‌పీ మద్దతుదారులు బయలుదేరారు. ఇస్లామాబాద్ వైపు సాగుతున్న ర్యాలీని ఆపేందుకు పోలీసులు రోడ్లను కంటైనర్లతో మూసివేశారు. వాటిని తొలగించాలని ప్రయత్నించిన ఆందోళనకారులు మరియు భద్రతా బలగాల మధ్య వాగ్వాదం మొదలై కొద్ది సేపటికే కాల్పుల వరకు దారితీసింది. పంజాబ్ పోలీస్ అధికారి ఉస్మాన్ అన్వర్ వివరాల ప్రకారం, నిరసనకారులు ముందుగా ఆయుధాలతో దాడికి దిగారని, ఒక సీనియర్ పోలీస్ అధికారి అక్కడికక్కడే మృతి చెందారని వెల్లడించారు. ఇదే విషయంపై టీఎల్‌పీ నాయకత్వం మాత్రం భిన్నంగా ఆరోపించింది. తమ మద్దతుదారులపై పోలీసులే విచక్షణారహితంగా కాల్పులు జరిపారని, ఎన్నోమంది ప్రాణాలు కోల్పోయారని పార్టీ ఆరోపించింది. ఈ ఘర్షణల్లో టీఎల్‌పీ చీఫ్ సాద్ రిజ్వీ కూడా బుల్లెట్ గాయాలతో తీవ్రంగా గాయపడ్డారని, ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పార్టీ ప్రకటనలో పేర్కొంది. కాల్పులు ఆపాలని భద్రతా సిబ్బందిని కోరుతూ రిజ్వీ విడుదల చేసిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ వీడియో సమయంలో కూడా కాల్పుల శబ్దాలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. లాహోర్‌లోని అనేక రహదారులపై నిరసనకారులు మంటలు పెట్టారు. వాహనాలు దగ్ధమయ్యాయి. పోలీసుల అదుపు చర్యల్లో ఇప్పటికే వంద మందికి పైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని ప్రధాన కమ్యూనికేషన్ మార్గాలు నిలిచిపోయాయి. ప్రజలు ఇళ్ల నుంచే బయటకు రావడానికి భయపడుతున్నారు. ఆసుపత్రుల్లో గాయపడిన వారితో హడావుడి వాతావరణం నెలకొంది.

గాజా ఘర్షణలు తగ్గుముఖం పడుతున్న సమయంలో టీఎల్‌పీ ఇలా హింసకు దిగడం అర్థం కావడం లేదని పాకిస్థాన్ ఉప అంతర్గత వ్యవహారాల మంత్రి తలాల్ చౌదరి తెలిపారు. రాజకీయ పార్టీలు ఇలాంటి ఉద్రిక్తతలను రెచ్చగొట్టకూడదని ఆయన హెచ్చరించారు. లాహోర్‌లో పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉండటంతో అదనపు బలగాలు మోహరించబడ్డాయి. ప్రజలు బయటకు రాకుండా ప్రభుత్వ యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది.

# కెనడాతో సంబంధాల బలోపేతంపై చర్చలు

బలోపేతం చేసి పరస్పరాభివృద్ధికి దారితీసే విధంగా అనేక ప్రతిపాదనలు చర్చకు వచ్చినట్లు తెలిసింది. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, శుభ్ర శక్తి ప్రాజెక్టులు, వ్యవసాయ రంగంలో నూతన విధానాలపై సహకారం, ఇరు దేశాల ప్రజల మధ్య విద్యా అవకాశాలు, ఉపాధి మార్పిడి వంటి అంశాలు అందులో ఉన్నాయి. ఈ సమావేశం ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త దిశను చూపుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ వాణిజ్య రంగంలో భారత్ వేగంగా ఎదుగుతున్న దేశంగా నిలుస్తుండగా, కెనడా పెట్టుబడులకు కూడా విస్తృత అవకాశాలు ఉన్నాయని భారత ప్రతినిధులు సూచించినట్లు సమాచారం. ముఖ్యంగా ఐటి, కృత్రిమ మేధస్సు, డిజిటల్ సేవలు, స్టార్టప్ రంగాల్లో భాగస్వామ్యం పెరిగితే ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలకు లాభం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, ఆధునిక పంట సాంకేతికత, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ విధానాలపై కలిసి పనిచేయాలన్న సంస్కరణ ప్రతిపాదనలు కూడా చర్చించబడ్డాయి. ప్రజల మధ్య అనుబంధాన్ని బలపర్చడానికి విద్యా మార్పిడి అవకాశాలు, విద్యార్థుల కోసం సులభ వీసా విధానం, ఉద్యోగ రంగంలో కొత్త అవకాశాలపై కూడా ఇరుపక్షాలు దృష్టి సారించాయి. భారతీయ కమ్యూనిటీ కెనడాలో కీలక పాత్ర పోషిస్తోందని, ఈ సామాజిక వంతెనను మరింత బలపరిచే మార్గాలపై చర్చ సాగింది. ఇలాంటి చర్చలు కేవలం ఒప్పందాలకే పరిమితం కాకుండా, భవిష్యత్ తరాలకు అభివృద్ధి దిశగా దోహదపడతాయని భావిస్తున్నారు.

# అయోధ్యలో చిన్న వ్యాపారులపై అమానుష ప్రవర్తన

బెదిరించి, ఎండలో నిలబెట్టి, బలవంతంగా ఉరక బైఠక్ చేయించి అవమానపరిచారని తెలిపింది. ఈ ఘటనను కాంగ్రెస్ 'తాలిబానీ తీరుతో వ్యవహరిం చడం'గా అభివర్ణించింది. పార్టీ విమర్శిస్తూ, పెద్ద వ్యాపారులకు ఎర్ర తివాచీలు పరిచి ఆత్మీయంగా ఆహ్వానిస్తారు, కానీ జీవనాధారం కోసం పోరాడే చిన్న వ్యాపారుల గౌరవాన్ని మాత్రం అడుగంటిస్తున్నారని మండిపడింది. ప్రజల ఎన్నికలతో వచ్చిన ప్రభుత్వాలు బలహీన వర్గాల హక్కులను కాపాడాల్సింది పోయి, ఇలా హింసాత్మకంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య వ్యవస్థపై మచ్చవేసే చర్యగా అభివర్ణించింది. ఈ ఘటనపై స్థానిక ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. జనజీవనానికి దగ్గరగా ఉండే చిన్న వ్యాపారులను ఇలాగే అవమానించడం కేవలం ఆ వ్యక్తులనే కాదు, వారి కుటుంబాల గౌరవాన్ని కూడా దెబ్బతీసే చర్యగా చూస్తున్నారు. ఇప్పుడు ఈ వ్యవహారంపై రాజకీయ వాదోపవాదాలు రేగాయి.

ఈ సంఘటన వెలుగులోకి రావడంతో సోషల్ మీడియాలో కూడా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. 'అయోధ్య అనేది భక్తి, దర్మానికి ప్రతీక' అని చెప్పుకునే చోట ఇలాంటి క్రూర వైఖరి ఎలా చోటుచేసుకుందనే ప్రశ్నలు ౖతున్నాయి.

# దుర్గాపూర్‌లో మెడికల్ విద్యార్థినిపై దారుణం

స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లిన సమయంలో నిందితులు వెంబడించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఈ అమానుష చర్యకు ఒడిగట్టారు. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న ఆమెను అక్కడే వదిలేసి నిందితులు పరారయ్యారు. స్థానికులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించగా ఆమె ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతోంది.

బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి శనివారం నుంచి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా, ఆదివారం రాత్రి మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. తాజాగా సోమవారం మధ్యాహ్నం ఐదో నిందితుడిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఐదుగురు నిందితులు పట్టుబడినట్లు అసన్‌సోల్-దుర్గాపూర్ పోలీస్ కమిషనరేట్ ప్రకటించింది. అయితే నిందితుల వివరాలను బయటపెట్టలేదు. ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. మహిళా భద్రతపై మళ్లీ ప్రశ్నలు తలెత్తగా, వైద్యవిద్య చదువుతున్న విద్యార్థినిపై జరిగిన ఈ దారుణం సమాజ మానవత్వాన్ని ప్రశ్నించేలా మారింది. ఈ ఘటన వెలుగులోకి రావడంతో కాలేజీ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. విద్యార్థి సంఘాలు, మహిళా సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ నిందితులకు కఠినమైన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. వైద్య విద్యార్థిని వంటి భవిష్యత్తు వైద్యురాలిపై ఇలా దాడి జరగడం సమాజంలో మహిళల భద్రత పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూపుతోందని ఆవేదన వ్యక్తమవుతోంది. కాలేజీ నిర్వహణ కూడా ఈ ఘటనపై సమగ్ర విచారణకు అభ్యర్థించింది. ఇక పోలీసులు కేసును వేగవంతంగా ముందుకు తీసుకెళు ్తన్నారు. బాధితురాలి ఆరోగ్యం పూర్తిగా కోలుకున్న తర్వాత ఆమె వాంగ్మూలం కూడా నమోదు చేయనున్నారు. సీసీటీవీ ఫుటేజ్, మొబైల్ లొకేషన్‌ల ఆధారంగా మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నారు. నిందితులపై కఠినమైన సెక్షన్లతో కేసు నమోదు చేసిన పోలీసు విభాగం, వేగవంతమైన కోర్టులో విచారణ జరిపించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఘటన దేశవ్యాప్తంగా మరోసారి మహిళా రక్షణ చట్టాలు అమలు విషయంలో ప్రభుత్వాల బాధ్యతను గుర్తుచేస్తున్నది.

# ప్రధాని మోడీ రాకతో కర్నూలుకు దేశ వ్యాప్తంగా గుర్తింపు

పెట్టుబడులు తీసుకొచ్చాం అన్నారు. రానున్న రోజుల్లో మరెన్నో పరిశ్రమలు వస్తాయని తెలిపారు. యువత ఇతర రాష్ట్రాలకు వెళ్ళకుండా ఇక్కడే ఉద్యోగాలు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణల వల్ల సామాన్య ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని ఆయన చెప్పారు. అనంతరం దేవినేని ఉమా మహేశ్వర రావు మాట్లాడుతూ జీఎస్టీ సభకు ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రధాని మోడీ పర్యటనను విజయవంతం చేద్దాం

భూమికి నాభిలా భక్తైలాసంగా విరాజిల్లుతూ నిత్య పూజలు అందుకుంటూ రాష్ట్రంలోనే రెండవ ప్రముఖ పుణ్య క్షేత్రంగా నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలానికి భారత ప్రధానమంత్రి రావడం ఎంతో శుభపరిణామమని, రాయలసీమ అభివృద్ధికి ప్రధానమంత్రి పర్యటన ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

శ్రీశైల శ్రీభ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లకు ప్రధాని మోడి ప్రత్యేక పూజలు, దర్శనం అనంతరం నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం నన్నూరు వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు హాజరవుతారన్నారు. జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు లబ్ది చేకూరే అంశం, రాయలసీమ అందులో నంద్యాల జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగించనున్నారని ఆమె తెలిపారు. ఈ బహిరంగ సభ సుమారు 3 లక్షలకు పైగా ప్రజలతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు. రాయలసీమ, ఉమ్మడి కర్నూలు జిల్లా, ముఖ్యంగా నంద్యాల జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, బైరెడ్డి అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటనను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.


# కమాండ్ కంట్రోల్ రూమ్ సమర్థవంతంగా పని చేయాలి

సందీప్ రఘువంశీ, సచిన్, తదితరులతో కలిసి కంట్రోల్ రూం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వీర పాండియన్ మాట్లాడుతూ కంట్రోల్ రూమ్ లో పని చేసేవారు 24 గంటలు షిఫ్ట్ ల వారీగా డ్యూటీ లు వేసుకొని ప్రతి 3 గంటలకు ఒకసారి అన్ని టీం ల నుండి సమాచారం తెప్పించుకోవాలన్నారు. ప్రతి టీమ్ చేస్తున్న పని ఏ రకంగా జరగాలో ఆ రకంగా జరుగుతుందా? లేదా? సరైన సమయంలో పనులు మొదలుపెట్టారా? లేదా? నిర్దేశించిన సమయంలో పని పూర్తయిందా? లేదా? అనే వివరాలను సేకరించి తెలియజేయడానికే కంట్రోల్ రూమ్ లో టీమ్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎస్ ఎం ఎస్ రూపంలో జరుగుతున్న పనుల గురించి వివరాలు పంపాలన్నారు. ముఖ్యంగా ఏ పని పురోగతి లేదు అనే విషయాలను హైలైట్ చేసి పంపాలన్నారు.

# గూగుల్ భారీ పెట్టుబడికి వేదికగా ఆంధ్రప్రదేశ్

**- అమెరికా పర్యటనలో మొదలైన ఆలోచన ఫలితంగా మారనున్నది - మంత్రి నారా లోకేష్ పర్యత్నాలకు గుర్తింపుగా రాష్ట్ర స్థాయి ఒప్పందం**



మన గళం, అమరావతి : గత సంవత్సరం అక్టోబరులో అమెరికాలో గూగుల్ ప్రధాన కేంద్రాన్ని సందర్శించిన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు సాంకేతిక రంగంలో భారీ పెట్టుబడి తీసుకురావాలనే ఆలోచన మొదలైంది. ఆ సందర్శనలో మంత్రి నారా లోకేష్ గూగుల్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఆంధ్రప్రదేశ్‌ను సాంకేతిక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే దృష్టిని వివరించారు. ఆ దృష్టి ఇప్పుడు సాకారం దిశగా అడుగులు వేస్తోంది. ఒక గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా కేంద్రం మరియు సంబంధిత సాంకేతిక మౌలిక వసతుల కోసం పది బిలియన్ డాలర్ల వ్యయంతో గూగుల్ పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైంది. ఈ ఒప్పందానికి సంబంధించిన పత్రాలు రేపు రాష్ట్ర ప్రభుత్వం మరియు గూగుల్ ప్రతినిధుల మధ్య సంతకం కానున్నాయి. రాష్ట్ర సాంకేతిక మరియు డిజిటల్ అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమంలో ప్రధాన పాత్ర పోషించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సాంకేతిక రంగంలో ఉన్నత స్థాయి ఉద్యోగాలు సృష్టించబడే అవకాశం ఉంది. రాష్ట్ర యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు లభించే దిశగా ఇది ఒక పెద్ద అడుగుగా భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను సాంకేతిక ప్రపంచ పటంలో నిలబెట్టేందుకు లోకేష్ చేపట్టిన చర్యలకు ఇదే మొదటి పెద్ద ఫలితమని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో ఇప్పుడు రేపటి ఒప్పందంపై ఆసక్తి నెలకొంది. గూగుల్ లాంటి అంతర్జాతీయ సాంకేతిక సంస్థ ఇంత పెద్ద స్థాయిలో పెట్టుబడి పెట్టడం దేశంలో అరుదైన విషయం. ఈ ఒప్పందం అమల్లోకి రావడం ద్వారా ఆంధ్రప్రదేశ్ సాంకేతిక రంగంలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**- లోకేష్ విజన్.. ఆంధ్రను టెక్ హబ్‌గా మార్చే ప్రయత్నం**

ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతిక రంగానికి కొత్త ఊపు తీసుకురావాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ గత సంవత్సరం నుంచే అంతర్జాతీయ కంపెనీలతో చర్చలు ప్రారంభించారు. అమెరికా పర్యటనలో గూగుల్ ప్రతినిధులతో సమావేశం ఆయన దృష్టికి మొదటి మెట్టు. "ఆంధ్రను ఉత్పత్తి కేంద్రం గానే కాకుండా, సాంకేతిక ఆలోచనల కేంద్రంగా కూడా నిలబెట్టాలి" అనే విజన్‌తో లోకేష్ వ్యవహరించడం గమనార్హం. గూగుల్‌తో రేపు కుదరబోయే ఒప్పందం ఆ దిశగా అతిపెద్ద ముందడుగుగా చూస్తున్నారు. పది బిలియన్ డాలర్ల పెట్టుబడి కేవలం ధనరాశి కాదు, దాని వెనుక ఉన్న అవకాశాలు మరింత పెద్దవి. ఒక గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా కేంద్రం వచ్చే దశల్లో ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే కాదు, ఆసియా స్థాయి గుర్తింపును తీసుకురావచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# బాలయ్య గుర్తు చేసిన ఎన్టీఆర్ మార్గం

మన గళం, అమరావతి : హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తన మనసులోని మాటలను బయటపెడుతూ, మళ్లీ ఒకసారి ప్రజల మన్ననలు పొందేలా మాట్లాడారు. చదువు పట్ల పెద్దగా ఆసక్తి లేకపోయినా, డిగ్రీ పూర్తి చేసిన తర్వాత సినీ రంగంలోకి అడుగు పెట్టానని స్పష్టంగా చెప్పారు. కానీ సినిమా అంటే కేవలం వినోదం మాత్రమే కాదని, దానికి సమాజానికి మెసేజ్ ఇచ్చే శక్తి ఉండాలని తన దృక్పథం అని తెలిపారు. బాలకృష్ణ చెప్పిన ఈ మాటల్లో ఆయనలోని వ్యక్తిత్వం, ఆయన పెరిగిన కుటుంబ విలువలు స్పష్టంగా కనిపించాయి. "ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలి" అనే ఆలోచన తన నాన్న ఎన్టీఆర్ నుంచి నేర్చుకున్నానని చెప్పడం ద్వారా, తాను నందమూరి వారసుడిగా కలిగిన బాధ్యతను మరోసారి గుర్తు చేశారు. హిందూపురం ప్రజలు కూడా బాలయ్య ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. కేవలం సినిమాల్లో హీరో కాదు, నిజ జీవితంలో కూడా మంచి మార్పు తీసుకురావాలనే ధ్యేయంతో నడుస్తున్న వ్యక్తిగా బాలయ్యను గుర్తించారు. ఆయన మాటలలో ఆత్మవిశ్వాసం మాత్రమే కాదు, సేవా దృక్పథం కూడా ఉంది.

ప్రజల కోసం చేసే ప్రతీ పని వెనుక తృప్తి ఉండాలని, పదవి కోసం కాకుండా సేవ కోసం ముందుకు రావాలని బాలయ్య చెప్పిన సందేశం అక్కడి యువతపై చాలా ప్రభావం చూపింది. రాజకీయాలు గానీ సినిమా గానీ ౦ రెండింటిలోనూ ప్రజల మనసు గెలుచుకోవడమే నిజమైన గెలుపు అని ఆయన చర్యల ద్వారా సూచించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక


## రాష్ట్ర స్కేటింగ్ కు ఎంపికైన ఇండస్ విద్యార్థులు



మనగళం, కర్నూలు సిటీ : జిల్లా రోలెస్కేటింగ్ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల కర్నూలు లో నిర్వహించిన జిల్లా స్థాయి రోలస్కేటింగ్ పోటీల్లో మంటిస్సోరి ఇండస్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మీనాక్షి విల్సన్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాది నుంచి తాము స్కేటింగ్ శిక్షణను మా పాఠశాలలో ఇప్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల సీఈఓ విల్సన్ అగస్టీన్ పాఠశాల పాఠశాల పీటీ, స్కేటింగ్ కోచ్ సురేష్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికుల విస్తృతస్థాయి సమావేశం

మనగళం, కర్నూలు సిటీ : కర్నూల్ నగరంలోని సెరీన్ నగర్ హమాలి అడ్డా వద్ద హమాలీ కార్మికుల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశానికి హమాలీ యూనియన్ నాయకులు కోటేష్ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఆర్ నరసింహులు, నగర కోశాధికారి సిహెచ్ సాయి బాబా కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కూలి రేట్లుగురించి ఏమాత్రం పట్టించుకోకుండా కార్మికుల హక్కులను హరించడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మికుల 29 చట్టాలను కుదించి యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లు గా చేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. రాష్ట్రంలో నికూటమి ప్రభుత్వం రాష్ట్రప్రజల ప్రయోజనాలను పక్కనపెట్టి నరేంద్ర మోడీ భజన చేయడం చాలా దుర్మార్గం అన్నారు. ఈనెల 16వ తారీఖున వస్తున్న సందర్భంగా నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ 15వ తేదీన ఉదయం 10 గంటలకు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కర్నూలు జిల్లాపరిషత్కార్యాలయం నుండి వామపక్షాల ఆధ్వర్యంలో కార్మికులు కర్షకులు ప్రజలు పెద్ద సంఖ్యలో ర్యాలీ గా బయలుదేరి కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నా చేపట్టబోతున్నామని, సీపీఎం, సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, రామకృష్ణ హాజరవుతారన్నారు. కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- క్వింటాంకు రూ. 2,500 గిట్టుబాటు ధర ఇవ్వాలి
- ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

మనగళం, కర్నూలు సిటీ : ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, క్వింటాంకు రూ. 2,500 చొప్పున గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏ కృష్ణ అధ్యక్షతన సోమవారం కర్నూలు కార్మిక కర్షక భవన్ లో ఉల్లి రైతుల సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. కర్నూల్ జిల్లాలో 45 వేల ఎకరాలు ఉల్లి పంటలు సాగు చేశారని, ఎకరాకు లక్ష రూపాయలు పైగా రైతులు పెట్టుబడి పెట్టి సాగు చేశారన్నారు. అయితే క్వింటాం 300 నుండి 500 లోపే ధర పలకడంతో రైతులు తీవ్రంగా నష్టపోయి అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉల్లి రైతులు ఆందోళన చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం 1,200 రూపాయలు క్వింటాలకు మద్దతు ధర ప్రకటించిందని, అయితే ఏ ఒక్క రైతుకు ఇంతవరకు అమలు కాలేదని విమర్శించారు. అంతలోనే రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి రైతులకు హెక్టారుకు 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇస్తామని ప్రకటించిందని, ఇది ముమ్మాటికీ రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. ఉల్లి రైతులు ఒక ఎకరాకు 70 క్వింటాళ్లు పండిస్తారని, ఆ లెక్క ప్రకారం ఎకరాకు 84 వేల రూపాయలు మద్దతు ధర వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన హెక్టార్కు 50 వేల రూపాయలు ఎకరాకు 20 వేలు మాత్రమే అందుతుందని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయి




ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతుల గోడును ఆలకించి క్వింటాంకు రూ. 2,500 మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో రైతులు ఉల్లి నిలువ పెట్టుకునేందుకు షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఉల్లి రైతుల పోరాట కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. కమిటీ కన్వీనర్ గా బొల్లవరం గోపాల్, "కో "కన్వీనర్ లుగా దేవ మాడ రామచంద్రుడు, కేతవరం బుగ్గ రాముడు ఎన్నికయ్యారు. 29 మందితో ఉల్లి రైతుల పోరాట కమిటీ ఏర్పడింది. అనంతరం కార్మిక కర్షక భవనం నుండి రైతులు ర్యాలీగా వ్యవసాయ మార్కెట్ వరకు వెళ్లి అక్కడ ధర్నా నిర్వహించారు. మార్కెట్ యార్డ్ కార్యదర్శి జయలక్ష్మి లేకపోవడంతో విజ్ఞాపన పత్రాన్ని గోడకు అతికించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఈ తాండ్రపాడు సర్పంచ్ బాలపీర, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, ఓర్వకల్ మండలం రైతు సంఘం కార్యదర్శి చంద్రబాబు నాయుడు, నాయకులు మధుసూదన్, ఆదోని మండలం కార్యదర్శి అయ్యప్ప, దేవనకొండ, ఆలూరు, కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు, కోడుమూరు, మండలాల రైతులు పాల్గొన్నారు.

## ట్రంప్ సుంకాలపై... ఎందుకు మౌనం ?

మనగళం, కర్నూలు సిటీ : ట్రంప్ విధించిన సుంకాలపై ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు మౌనం వహిస్తున్నారని సీపీఎం నాయకులు ప్రశ్నిన్షరు. స్థానిక కార్మిక కర్షక భవన్ ఆవరణలోని ఐలమ్మ భవన్ లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నగేష్ అధ్యక్షతన ట్రంప్ విధించిన సుంకాలు-భారత్ పై ప్రభావం అనే అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. ఐద్యా రాష్ట్ర నాయకురాలు పి నిర్మల, సీపీఎం రాష్ట్ర నాయకులు పీఎస్ రాధాకృష్ణ, టి రాముడు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రాజశేఖర్ తదితరులు మాట్లాడారు. ట్రంపు తాను చెప్పినట్లు రష్యా నుండి భారత్ ఆయిల్ కొనుగోలుని ఆపాలని, అమెరికా ఎగుమతులపై సుంకాలను రద్దు చేయాలని భారత ప్రభుత్వానికి అల్టిమేట్ జారీ చేసి చివరకు 50% సుంకాలను, హెచ్1బి వీసా పై లక్ష డాలర్ల ఫీజును ప్రయోగించాడని దీన్ని తీవ్రంగా వ్యతిరేకంచాల్సిన మోడీ ప్రభుత్వం నోరు మెదపకుండా మౌనం వహించడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. ట్రంపు సుంకాల ప్రభావంతో భారతదేశంలోని మొక్కజొన్న పత్తి గోధుమ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, అలాగే ఆక్వా రైతాంగం నష్టపోతుందని తెలిపారు. ముఖ్యంగా రొయ్యల పెంపకం తయారీలో ఆక్వా పరిశ్రమలు దేశవ్యాప్తంగా 241 ఉంటే అందులో ఆంధ్రప్రదేశ్ 171 ఉన్నాయని, అందులో పని చేసే 40 లక్షల మంది ఉపాధి ప్రమాదం లో పడిందని తెలిపారు. అలాగే ఫార్మా, లెదర్, కెమికల్, ఆటోమొబైల్ పరిశ్రమల విడిభాగాల తయారీపై తీవ్రమైన ప్రభావం వల్ల భారతదేశం దాదాపు 48.7 బిలియన్ డాలర్ల వాణిజ్య పై ప్రభావం పడుతుందని తెలిపారు. అమెరికా భారతదేశానికి ఎగుమతి చేస్తున్న పత్తి పైన




ఉన్న 11% సుంకాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎత్తేసిందని తెలిపారు. పక్కనే ఉన్న చైనా తమ దేశం ఎగుమతుల పైన అమెరికా విధించే సుంకాలకు దీటుగా సుంకాలు విధిస్తామంటూ నిలువరిస్తున్నారని గుర్తు చేశారు. అయితే మోడీ మాత్రం ఆ ధైర్య సాహసాలు చేయకుండా మౌనంగా వహించడం విచారకరమన్నారు. అదేవిధంగా సీపీఎం నాయకులు రామాంజనేయులు, ఆర్ నరసింహులు రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి గురు శేఖర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి రాఘవేంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నగర అధ్యక్షులు నాగరాజ్, ఆవాస్ జిల్లా నాయకులు ఎస్ఎండి షరీఫ్, కేవీపీఎస్ నగర అధ్యక్షులు ఏసు తదితరులు మోడీ తీరును తప్పుపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్, సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ సాయి బాబా, సుధాకరప్ప రామకృష్ణ, నగర నాయకులు కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ మద్యంపై యర్రగొండపాలెం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రణభేరి








మన గళం : యర్రగొండపాలెం నియోజకవర్గంలో నకిలీ మద్యం వ్యాప్తి రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలతో కలిసి తాటిపర్తి చంద్రశేఖర్ భారీ ర్యాలీగా వెళ్లి యర్రగొండపాలెం ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నకిలీ మద్యం తయారీని పరిశ్రమ స్థాయికి చేర్చిన టీడీపీ నాయకులు, కూటమి ప్రభుత్వం మద్యం విధానాల పేరుతో ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం వల్ల అనేక మంది బలైపోతున్నారని, ప్రభుత్వం దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. యర్రగొండపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి జ్యోతిరావుపులే నగర్ వరకు ర్యాలీ కొనసాగి, అక్కడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. నినాదాలతో మారుమ్రోగిన ఆ ప్రాంతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కూటమి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.

నకిలీ మద్యాన్ని అరికట్టడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగుతాయని, ప్రజల ఆరోగ్య రక్షణ కోసం పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని నాయకులు స్పష్టం చేశారు.

## కేఎంసీ ఈఎన్టీ పీజీ విద్యార్థుల ప్రతిభ

మనగళం, కర్నూలు సిటీ : ఈ.ఎన్.టీ విభాగపు అసోసియేషన్ ఆఫ్ ఓటోలారింగోలజిస్ట్సు ఆఫ్ ఇండియా, (ఏఓఐ) ఆధ్వర్యం లో ఇటీవల విజయవాడలో నిర్వహించిన సౌత్ జోన్ స్థాయి సదస్సులో కర్నూల్ మెడికల్ కాలేజీ ఈ.ఎన్.టీ విభాగపు పీజీ తృతీయ విద్యార్థులు ప్రతిభ చాటారు. విద్యార్థిని డా. దివ్య నాగేశ్వరి క్విజ్ విభాగం లో గోల్డ్ మెడల్, టెంపొరల్ బోన్ డిసేక్షన్ యందు డా . షేఖ్ షాజియా జబీన్ సిల్వర్ మెడల్ సాధించడంపై అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే.చిట్టి నరసమ్మ అభినందించారు. అదేవిధంగా ఈ.ఎన్.టీ విభాగపు ఇన్చార్జి అధిపతి డా. హరికృష్ణకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లింగన్న, ఎస్సార్ డా. ప్రేసి షరాన్, పీజీలు పాల్గొన్నారు.



## జీఎస్టీ ని సృష్టించడం ఎందుకు... తగ్గించడమెందుకు?

- యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగ మధు యాదవ్ సూటి ప్రశ్న




మనగళం, కర్నూలు సిటీ : ఎనిమిదేళ్ల కిందట ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జీఎస్టీని సృష్టించడం ఎందుకు.... ఇప్పుడు తగ్గించడం ఎందుకు అని జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి ఎం నాగ మధు యాదవ్ ప్రశ్నించారు. ప్రజలను జీఎస్టీ రూపంలో ఎనిమిదేళ్లు దోచుకుని, ఇప్పుడేమో తాఫీగా తగ్గిస్తున్నామంటూ ఎవరిని మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నాగ మధు యాదవ్ మాట్లాడారు. 2017 లో నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి జీఎస్టీని ప్రారంభించిన రోజే లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తప్పుపట్టారని గుర్తు చేశారు. జీఎస్టీ దేశానికి మంచిది కాదని చెప్పిన రాహుల్ గాంధీపై వ్యంగంగా మాట్లాడిన బీజేపీ యన్ డీ ఏ నాయకులు ఎనిమిదేళ్ల తర్వాత తప్పును సరి చేసుకుంటున్నారే తప్పా ప్రజలపై ఏ మాత్రం ప్రేమతో కాదని ఆరోపించారు. ప్రత్యేకంగా కర్నూలు జిల్లా కు వచ్చి వ్యాపారస్తులతో సమావేశం అవుతున్నారట... ఇందులో మతలబ్ ఏమిటో సమాధానం చెప్పాలని కూటమి నాయకులను డిమాండ్ చేశారు. రాయలసీమకు ప్రత్యేక ప్యాకెజీ ఇస్తామని ఇచ్చిన హామీని విస్మరించిన ప్రధాని మోడీని ప్రశ్నించే నేతలు లేరా అని నిలదీశారు. ప్రత్యేక హెూదాల లేకపోయే... సాక్షాత్తూ తిరుపతి వేంకటేశ్వర స్వామి సన్నిధిలో మాట్లాడిన మాటలకు సమాధానం లేదు... యువతకు ఇచ్చిన హామీల ఊసే లేదు... వీటన్నింటికీ ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కూటమి పెద్దలు మోడీ భజన మానుకుని.... రాష్ట్రానికి, జిల్లాకు ఏదైనా ప్రయోజనం చేకూరేలా ప్రధానిని ఒప్పించి... ప్రజలను మెప్పించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనిధి రాయల్, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, శ్రీధర్ గౌడ్ మొదలగు తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోదీగారి సభ ఏర్పాట్లు పరిశీలించిన బీజేపీ నాయకులు..... హేమసుందర్ రెడ్డి



మన గళండోన్ ఈ నెల 16 న కర్నూల్‌లో గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ భారీ బహిరంగ సభ సందర్భంగా నన్నూరు రాగమయూరి గ్రీన్ హిల్స్ వద్ద కమాండ్ కంట్రోల్ రూంలో భోజన ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ తో కలిసి సివిల్ సప్లైస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు . సభకు భారీగా తరలి వచ్చే ప్రజలకు భోజన ఏర్పాట్ల విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించాను. అందరం కలిసికట్టుగా పని చేసి ప్రధాని మోదీ గారి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతున్న రాష్ట్ర మంత్రులురోడ్డు %డ%భవనాల శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి , భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ,టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు,పాణ్యం మ్మెల్యే గౌరు చరిత గారు,బీజేపీరాష్ట్ర కార్యదర్శి సురవరం గీత మాధురి గారు, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి మరియు కూటమి నాయకులు,అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు

## గ్రామాన్ని అభివృద్ధి చేసుకోండి : డాక్టర్ సుంకన్న

మన గళండోన్ గ్రామస్తులు ఐకమత్యంగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ప్రముఖ వైద్యులు ఎస్.సుంకన్న అన్నారు. బి. బొంతిరాళ్ళ గ్రామంలో సుంకులమ్మ పుణప్రతిష్ట నిర్మాణానికి 50 వేల రూపాయలను డాక్టర్ యశోద, సుంకన్న దంపతులు సర్పంచ్ జె. రవి మోహన్ కు సోమవారం యశోద హాస్పిటల్ ల్లో అందజేశారు. ఈ డాక్టర్ సుంకన్న మాట్లాడుతూ గ్రామంలో అందరూ కలిసి కట్టుగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవాలన్నారు. గ్రామభివృద్ధికి కుల, మతాలకు అతీతంగా అందరూ సహకరించు కోవాలన్నారు. సర్పంచ్ రవి మోహన్ మాట్లాడుతూ సంపాదించిన సొమ్ములో కొంత భాగం సేవా కార్యక్రమాలకు ఉపయోగించడంలో సంతృప్తి ఉంటుందన్నారు. గ్రామం తరుపున కృతజ్ఞతలు తెలిపారు.



## కాపునాడు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సిద్ధం. కృష్ణవేణి ఆధ్వర్యంలో

మనగళం, మార్కాపురం... ప్రకాశం జిల్లా కాపునాడు నాయకులు ఈనెల 26వ తారీకు ప్రతిష్టాత్మకంగా చేపట్టే కాపునాడు జోన్-4 (ప్రకాశం, బాపట్ల, నెల్లూరు) ప్రాంతీయ సదస్సుకు నియోజకవర్గ కాపు మహిళా అధ్యక్షురాలు సిద్ధం కృష్ణవేణి ఆధ్వర్యంలో మార్కాపురం కాపు నాయకులను, కాపు పెద్దల్ని కలిసి ప్రాంతీయ సదస్సుకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్ , బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ పి.వి. కృష్ణారావుని జిల్లా కాపునాడు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కాపునాడు ప్రాంతీయ సదస్సుకు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కాపునాడు అధ్యక్షులు పొగుల మల్లికార్జున్ , దాసరి పిచ్చయ్య , చెంగళశెట్టి సుధాకర్ , బండారు సురేష్ , గారా నారాయణరావు , నియోజకవర్గ కాపునాడు అధ్యక్షురాలు సిద్ధం కృష్ణవేణి(%దీఘ౦బ%) పాల్గొన్నారు.



## అమెరికా-చైనా ట్రేడ్ వార్.. నష్టాల్లో దేశీయ సూచీలు..

మనగళం, ఇజ్రాయెల్-హమాస్ మధ్య జరుగుతున్న గాజా యుద్ధం ముగియడం అంతర్జాతీయ మార్కెట్లలో జోష్ నింపినప్పటికీ, చైనా-అమెరికా ట్రేడ్ వార్ ఆందోళన కలిగించింది. చైనాపై డొనాల్డ్ ట్రంప్ వంద శాతం సుంకాలు విధించడంతో అమెరికా మార్కెట్లు శుక్రవారం భారీగా నష్టపోయాయి. ఆ ప్రభావం ఈ రోజు దేశీయ సూచీలపై పడింది. పలు రంగాలు నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాలతో రోజును ముగించాయి . గత శుక్రవారం ముగింపు (82, 500)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 450 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత కాస్త కోలుకుంది. మధ్యాహ్నం వరకు భారీ నష్టాల్లోనే కదలాడినప్పటికీ చివర్లో కోలుకుంది. మధ్యాహ్నం తర్వాత మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గచూపడంతో నష్టాలు తగ్గాయి. చివరకు సెన్సెక్స్ 173 పాయింట్ల నష్టంతో 82, 327 వద్ద రోజును ముగించింది.

## ప్రతిభ చాటిన కేఎంసీ డాక్టర్ చందనా రాజారామ్

మనగళం, కర్నూలు సిటీ : మాస్టర్స్ ఆక్వాటిక్ ఫెడరేషన్ ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో కర్నూల్ మెడికల్ కాలేజీ అనస్తీసియా విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. చందన రాజారాం స్విమ్మింగ్ లో ప్రతిభ చాటారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. చందన రాజారాం స్విమ్మింగ్ లో ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రీస్ట్ స్ట్రోక్ లో ఒక గోల్డ్ మెడల్, రెండు సిల్వర్ మెడల్స్, ఒక కాంస్యం సాధించడంపై ఏడీఎంఈ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు అభినందనలు తెలిపారు. కేఎంసీ విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ రాష్ట్రస్థాయిలో వైద్య విద్యలో ప్రతిభ కనబరచడమే కాకుండా కాకుండా విభిన్న రంగాల్లో ప్రతిభ కనపరుస్తుండడం పట్ల సంతోషాన్ని వ్యక్తపరిచారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ చేతుల మీదుగా డాక్టర్ చందన రాజారామ్ మెడల్స్ స్వీకరించడం జరిగింది.

## ప్రధాని మోడీ పర్యటను విజయవంతం చేద్దాం



మనగళం, సి.బెళగల్ : ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 16వ తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారని, ఐకమత్యంగా విజయవంతం చేద్దామని సి.బెళగల్ మండల బీజేపీ అధ్యక్షుడు గుజ్జుల పూర్ణ ప్రకాష్ నాయుడు పిలుపునిచ్చారు. 16వ తేదీ నన్నూరు టోల్ ప్లాజా సమీపంలోని రాగమయూరి వద్ద నిర్వహించే మోడీ భారీ బహిరంగ సభకు కూటమి శ్రేణులు, ప్రజలు తరలిరావాలని కోరారు. ప్రధాని కర్నూలు రావడం సంతోషకరమని, ప్రతిఒక్కరూ సభకు తరలివచ్చి మోడీపై మనకు ఉన్న అభిమానాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. కర్నూలు నుండి సొంత వాహనాల ద్వారా సభకు వచ్చే వారు ఫస్ట్ ఎంట్రీ 1ఏ రోడ్ ద్వారా లోపలికి వచ్చి పీ1 ఏరియాలో పార్కింగ్ చేసుకోవాలన్నారు. అదే సమయంలో నంద్యాల వైపు నుండి వచ్చే వారు డబ్ల్యూ7 రోడ్డు నుండి లోపలికి వచ్చి పీ7 ఏరియాలో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

## కల్తీ మద్యాన్ని అరికట్టాలి






మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులైపారుతోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అరికట్టాలని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కర్నూలు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద మహిళలతో,నాయకులతో కలిసి కాటసాని ధర్నా చేశారు. కూటమి సర్కార్ కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏలుతున్న ప్రభుత్వ పెద్దలు, రాష్ట్రాన్ని మద్యం మత్తులో ముంచెత్తారు.... ఎక్కడిక్కడ నకిలీ ఫ్యాక్టరీలు పెట్టి, కల్తీ మందు తయారుచేసి, ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టి, అడ్డగోలుగా కోట్ల రూపాయల దండుకున్న ఒక దారుణమైన మాఫియా కథ ఇటీవలే బటయపడిందని గుర్తు చేశారు. చిత్తూరు జిల్లా ఎక్కడో సరిహద్దు నియోజకవర్గం తంబళ్లపల్లె నియోజకవర్గం, ములకల చెరులో బయటపడ్డ టీడీపీ వాళ్ల కల్తీ ఫ్యాక్టరీ లింకులు.. తర్వాత బెజవాడలోనూ బయటపడ్డాయన్నారు. అన్నింటినీ ఒక చోట పేర్చి చూస్తే... ఈ మాఫియా ఎంత విస్తారంగా ఉందో మనకు తెలుస్తుందన్నారు. కల్తీ మద్యాన్ని ఎలా తయారు చేస్తున్నారు, ముడిసరుకును ఎలా తెచ్చుకుంటున్నారు, కల్తీ మద్యం బాటిళ్లను ఎలా తయారు చేస్తున్నారు, వాటి లేబుళ్లను ఎలా తయారు చేస్తున్నారు, అసలు బాటిళ్లలా ఫెర్ఫెక్ట్ సీళ్లు ఎలా వేస్తున్నారో కూడా రాష్ట్రం, దేశం మొత్తం చూసిందన్నారు. ఇలాంటి వ్యవహారాల్లో ఆరితేని తెగులుగుదేశం పార్టీ మనుషులు అత్యంత పగడ్బందీగా దీన్ని నడుపుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే... నకిలీ మద్యాన్ని నియంత్రించాలన్న ఉద్దేశమే ఉంటే, ప్రతి లిక్కర్ షాపులో సోదాలు చేసిదని తెలిపారు. ఇప్పటికైనా కల్తీ మద్యాన్ని అరికట్టి ప్రజలు ప్రాణాలు కాపాడాలని, లేని పక్షంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్లు,మండల నటులకు నాయకులు,మహిళలు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రమాణ స్వీకారం



మనగళం, ఓర్వకల్లు : మండల కేంద్రం ఓర్వకల్లులోని కాల్వబుగ్గ శ్రీ బుగ్గరామేశ్వర స్వామి దేవస్థానం ఆలయ ధర్మకర్తలు, చైర్మన్ ల ప్రమాణ స్వీకారం సోమవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాణ్య%శీ% ఎమ్మెల్యే, అసెంబ్లీ కమిటీ చైర్ పర్సన్ గౌరు చరిత రెడ్డి, ఉమ్మడి జిల్లా టీడీపీ సీనియర్ నేత నందికొట్కూరు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జి గౌరు వెంకట రెడ్డి హాజరయ్యారు. గౌరు దంపతుకు ఆలయ ధర్మ కర్తలు,కూటమి పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్బంగా గౌరు దంపతులు మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం లో బుగ్గ రామేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అంతేకాకుండా 16 వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం కు విచ్చేస్తున్న సందర్భంగా భారీ ఎత్తున ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు టీటీడీ బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, రాష్ట విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కే పార్వతమ్మ, రాష్ట కార్పొరేషన్ డైరెక్టర్ లు మంజునాథ్,సుబ్బయ్య, సింగిల్ విండో ప్రెసిడెంట్ లు సుధాకరయ్య,ఉయ్యాలవాడ నాగేశ్వర రెడ్డి, పాలకోలను సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు గోవింద్ రెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, దేవస్థానం చైర్మన్ కే నారాయణ, ఆలయ ధర్మ కర్తలు,కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రధాని పర్యటన సందర్భంగా శ్రీశైలం నందు పటిష్ట బందోబస్తు ఏర్పాటు





మనగళం శ్రీశైలం : బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షెరాన్ శ్రీశైల దేవస్థానంలోని అక్టోబర్ 16 న భారతదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రముఖ పుణ్యక్షేత్రం జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం నందు పర్యటించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోనున్న సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింది. ఇప్పటికే శ్రీశైల పరిసర ప్రాంతాలలు, నల్లమల్ల అడవి ప్రాంతాలలో గ్రేహౌండ్స్ సాయిధ బలగాలు ప్రధాని పర్యటనకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షెరాన్ %కూూ% గారు ప్రధాని పర్యటించే ప్రదేశాలలో అనగా హెలిపాడ్,రోడ్డు మార్గం, భ్రమరాంబ గెస్ట్ హౌస్, గుడి పరిసర ప్రదేశాలు, సేఫ్ హౌస్ మొదలగు ప్రాంతాలలో పర్యటించి భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తీసుకోవలసిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది.

మంగళవారం
14 - 10 - 2025
మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

సముద్ర సరిహద్దుల సంరక్షణలో నేవీ సేవల అర్చనీయ పాత్ర

నౌకాదళాలు ప్రపంచ ప్రజాస్వామ్యాల్లో, ఆర్థిక వ్యవహారాల్లో మరియు రక్షణ విధానాల్లో ఒక ప్రత్యేక స్థానం కలిగివున్నాయి. సముద్రాలు వాణిజ్య మార్గాలుగా, జీవవైవిధ్యానికి నివాస స్థలంగా, మరియు దేశాల వ్యూహాత్మక ఆస్థులుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పుడే, వాటిని రక్షించడంలో నౌకాదళాల పాత్ర అమూల్యంగా ఉంటుంది. భారత సముదాయాల్లోనూ, ప్రపంచవ్యాప్తంగా నౌకాదళాల స్థాపన, అభివృద్ధి, సేవల్ని గుర్తించే సందర్భంగా నేవీ బర్త్‌డే ప్రత్యేకత ఉంటుంది.

చరిత్రలో నౌకాదళాల స్థాపన ఒక కొత్త అధ్యాయం. సముద్ర ప్రయాణాలు పాతకాలం నుంచి ఉన్నా, ఆధునిక రక్షణ దళాలుగా రూపుదిద్దుకోవడం దేశాల సవాళ్లకి ప్రత్యుత్తరాలివే. అమెరికా సహా అనేక దేశాల్లో అక్టోబర్ 13ని నేవీ బర్త్‌డేగా గుర్తిస్తారుబీ భారత నేవీ డే డిసెంబర్ 4న జరుపుకుంటుంది. ఈ తేదీల్లో ఆ దేశాల నౌకాదళాల చారిత్రక ఘట్టాలు, విజయాలు, త్యాగాలు మరియు భవిష్యత్తు లక్ష్యాలు విశ్లేషిస్తారు.

నేవీ బర్త్‌డే సమస్యలు, సామర్థ్యాలు, మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించడానికి మంచి అవకాశం. నౌకాదళం కేవలం యుద్ధ సామర్థ్యం మాత్రమే కాదు అది బహుళవిధ సేవలే పంచుతుంది: సహాయక చర్యలు, విపత్తుల సమయంలో సచల స్పందనలు, అంతర్జాతీయ సముద్ర సహకారం, సముద్ర దోపిడీ నిరోధక చర్యలు, మరియు నాణ్యమైన నౌకాయాన రక్షణ. సముద్ర పరిధుల్లో శాంతి, సుదీర్ఘ వాణిజ్య మార్గాల రక్షణ అన్నింటికీ నౌకాదళాలు ప్రాథమిక భూమిక పోషిస్తాయి. సాంకేతిక పరిజ్ఞానం నౌకాదళాలను మరింత సామర్థ్యవంతంగా మారుస్తోంది. సాటిలైట్ నావిగేషన్, అడ్వాన్స్‌డ్ రాడార్‌లు, ఎలక్ట్రానిక్ వార్ఫేర్ సామర్థ్యాలు, గూఢచర్య వ్యూహాలు, మరియు దూర సేవా సామర్థ్యాలు నౌకాదళాల పనితీరును మార్చేసాయి. ఇదే సమయంలో, డ్రోన్లు, అండర్‌వాటర్ రీమోట్ వాహనాలు, మరియు న్యాయోపకరణాల ప్రభావం సముద్ర యుద్ధ రూపాలను కూడా కొత్తదైర్చుచేస్తోంది. సాంకేతికతతో పాటుగా మానవశక్తి శిక్షణ, నైతిక ప్రమాణాలు, మరియు ఆచరణలో సఖ్యత కూడా అవసరం.

నేవీ సేవలో ఉండే వ్యక్తుల త్యాగాలు పొదుపు కాదు. సముద్రంలో వారాలు, నెలలు గడిపి కుటుంబాల నుండి దూరంగా పని చేయడం, గతి నిబంధనల ప్రకారం కఠిన శిక్షణలు, ప్రమాదకర పరిస్థితులు ం ఇవన్నీ వారి జీవితభాగం. ఈ రోజున వారి సాహసాన్ని, కుటుంబాల త్యాగాన్ని గుర్తు చేసుకోవడం, మద్దతుగా నిలవడం మనముందున్న బాధ్యత. సైనికుల శారీరక మరియు మానసిక సంక్షేమాన్ని బలోపేతం చేయడానికి సమాజం, ప్రభుత్వం కలిసి చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

నౌకాదళ శక్తి పెరగడంతో కూడుకునే ఒక పెద్ద సమస్య సముద్రపరిరక్షణతో పాటు పర్యావరణ హిత పాలనను పాటించడం. కోస్తా పేట్రోలింగ్, మత్స్యశాస్త్ర పరిరక్షణ, సముద్ర కాలుష్య నియంత్రణ వంటి కార్యాచరణలు సముద్ర జీవవైవిధ్యాన్ని సంరక్షించడంలో కీలకంగా ఉంటాయి. సముద్ర వనరుల వినియోగాన్ని సమతుల్యతతో చేసుకోవడం లేకపోతే భవిష్యత్తులోనే ఆ వనరులు అతి కోల్పోతాయి ం ఇదే ఒక జాగ్రత్త. నేవీ బర్త్‌డే సందర్భంగా విద్యావిద్యార్థులు, యువతకు సముద్రవిజ్ఞానం, నౌకాయానానికి సంబంధించిన కెరీర్ అవకాశాలు, మరియు సముద్రసేవల ప్రాధాన్యతను వివరించే కార్యక్రమాలు నిర్వహించడం ముఖ్యం. సముద్రలో పని చేయడం అంటే ఒక సాహస మార్గమే కాకుండా దేశ సేవలో సుస్థిరమైన వరకూ మారుతుంది. మంచి విద్యా కార్యక్రమాలు, సముద్ర శిక్షణ శిబిరాలు మరియు సివిల్%-%మిలిటరీ భాగస్వామ్యంతో బహిరంగ అవగాహన పెరిగితే సమాజం అంతా లాభపడుతుంది. రాష్ట్రాల మధ్య, అంతర్జాతీయ సంయుక్తత ద్వారా సముద్ర భద్రతను బలోపేతం చేయవచ్చు. పోర్టు భద్రత, ఆన్‌షోర్-ఆఫ్‌షోర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పరిరక్షణ, విజిలెన్స్ నెట్‌వర్క్ స్థాపించడం ద్వారా సముద్ర ఆదాయ మార్గాలను రక్షించవచ్చు. అంతర్జాతీయ నిబంధనలు, సముద్ర కడతీర్పుదలల్లో సంయుక్త విధానాలు ప్రతి దేశానికి అవసరం. ప్రజలు, వాణిజ్య సంస్థలు, మరియు ప్రభుత్వాలు కలిసి పనిచేస్తేనే సముద్ర భద్రతా సమస్యలు సమగ్రంగా పరిష్కరించబడతాయి.

నేవీ బర్త్‌డే ఒక జ్ఞాపక దినం మాత్రమే కాకుండా ముందస్తు ప్రణాళిక, సామాజిక బాధ్యత, మరియు సాంకేతిక అభివృద్ధి ఎలా సమతుల్యంగా సాగించాలో ఆలోచించాల్సిన వేళ. జయప్రద మిషన్లు, శాంతి క్యాంపెయిన్‌లు మాత్రమే కాదు ం సముద్రస్వభావం కాపాడటం, జీవుల సంక్షేమం, మరియు దేశ భద్రతను సమకాలీనంగా తలంపుకోవడం అవసరం. ఈ రోజున ప్రతి పౌరుడూ ఒక చిన్న ఆలోచన చేయాలి: సముద్రభూమి మనందరి సంరక్షణకు సులభంగా కేటాయించదగినది కాదు ఆ పరిమితి తెలియకపోతే మనను ఈ సముద్రమే పాఠం నేర్పిస్తుంది. ఒక దేశానికి సముద్రం అంటే ఆ దేశ భవిష్యత్తు కూడా కావచ్చు. నేవీ బర్త్‌డే ద్వారా సముద్రభద్రత, నౌకాదళ సేవల ప్రాముఖ్యత, మరియు సముద్రాన్ని పరిరక్షించే బాధ్యతలను పునఃస్థాపించుకుందాం శక్తివంతమైన సైన్యంతో పాటు జవాబుదారీ పౌరుల సమాజాన్ని కలిగించే దిశలో ఒక అడుగు వేయబడాలి.

– విశ్లేషణ : మునిగాల రాజు పాత్రికేయులు, డిజైనర్ టెక్ గురు.
8897975262

# నకిలీ మద్యం వ్యాపారాలపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ





కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విచ్చలవిడిగా నకిలీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ గారు తీవ్రంగా విమర్శించారు. ఈరోజు ఉదయం పత్తికొండ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం ముందు పార్టీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించిన ఆమె మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి, కూటమి ప్రభుత్వంలోని నాయకులు అక్రమ మద్యం వ్యాపారాలు చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ఆర్సీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎక్సైజ్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించి, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. నకిలీ మద్యంపై కూటమి ప్రభుత్వం స్పందించి, స్వచ్ఛందంగా సీబీఐ విచారణ కోరాలని డిమాండ్ చేశారు. అలాగే ఎక్సైజ్ శాఖ అధికారులు తమ మొద్దు నిద్ర విడిచి చర్యలు తీసుకోవాలని సూచించారు. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా, గుడులు, బడులు పక్కనే వీధి వీధికి బెల్ట్ షాపులు ఏర్పడి నకిలీ మద్యం విక్రయాలు సాగుతున్నాయని విమర్శించారు. ఇటీవల పత్తికొండ నియోజకవర్గంలోని మద్ది కేర మండలం యడవలి గ్రామానికి చెందిన పెద్దన్న అనే వ్యక్తి, అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణంలోని ఒక టిడిపి నాయకుడి బార్‌లో నకిలీ మద్యం సేవించి మృతిచెందిన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు నకిలీ మద్యం తయారీని ఒక పరిశ్రమలాగా మార్చి, రాష్ట్రవ్యాప్తంగా వ్యాపింపజేస్తున్నారని ఆరోపించారు. చిత్తూరు జిల్లా ములకలచెరువు, విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం వద్ద పట్టుబడ్డ నకిలీ మద్యం డంపులు దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలోని ముఖ్యులు పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లు ఈ దారుణ పరిస్థితులపై స్పందించకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. "మా జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నకిలీ మద్యం పై ఉక్కుపాదం మోపి ప్రజల ప్రాణాలను కాపాడిన ఘనత మాదే" అని శ్రీదేవమ్మ గారు గర్వంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ నియోజకవర్గంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల కన్వీనర్లు, మహిళా నాయకులు, సర్పంచులు, ఎంపిటీసీలు, పార్టీ శ్రేణులు భారీగా పాల్గొన్నారు.




# సంక్షేమ బోర్డును యథావిధిగా కొనసాగించాలి

మనగళం, ఎమ్మిగనూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులు సుదీర్ఘకాలం పోరాడు సాధించుకున్న భవన నిర్మాణ సంక్షేమ బోర్డును యథావిధిగా కొనసాగించాలని ఐఎఫ్ టీయూ జిల్లా నాయకులు ఎస్.బాలరాజు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ నిధులను దారిమళ్లించాలని ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిల్డింగ్ కన్స్ట్రక్షన్ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మిగనూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందిన భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో ఉన్నా లేకున్నా తక్షణమే సంక్షేమ బోర్డు నుండి పది లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని తెలిపారు. సహజ మరణం చెందిన కార్మికుడికి ఆరు లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు. మహిళా కార్మికులకు ప్రసూతి అలవెన్స్ కింద 50వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు నుండి కార్మికులకు ఇచ్చిన కార్డు ద్వారా కుటుంబానికి ఉచిత వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.సత్యన్న, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు బాబు,డివిజన్ నాయకులు మల్లికార్జున, వీరేశ్,వీరా రెడ్డి, రాజేంద్ర, బజారప్ప, రూపేష్, హరి, సోమప్ప, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.




# డోన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మండల మరియు పట్టణ కన్వీనర్ నియామకం













మన గళండోన్
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు మరియు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి సూచనల మేరకు డోన్ శాసన సభా నియోజకవర్గంలోని మూడు మండలాలు, మూడు పట్టణాలకు పార్టీ కన్వీనర్లను నియమించడమైనది. ఈ ఆదేశాల ప్రకారం వారు వారి పరిధిలో పార్టీ బాధ్యతలు నిర్వర్తించనున్నారు.
డోన్ మండల పార్టీ కన్వీనర్గా దశరథ రామ్ రెడ్డి
బేతంచెర్ల మండల కన్వీనర్గా ఎల్ల నాగయ్య
ప్యాపిలి మండల కన్వీనర్గా మెట్టుపల్లి సుదర్శన్ వ్యవహరించనున్నారు.
డోన్ టౌన్ కన్వీనర్గా టి ఇ రాఘవేంద్ర గౌడ్
బేతంచెర్ల టౌన్ కన్వీనర్గా శ్రీమతి బుగ్గన ప్రసన్న లక్ష్మి
ప్యాపిలి టౌన్ కన్వీనర్గా కొంగనపల్లి మధు పార్టీ కార్యక్రమాలను నిర్వర్తించనున్నారు. వీరికి ఆయా మండలాలు, పట్టణాల్లోని పార్టీ కార్యకర్తలు, నాయకులు సహకరించి పార్టీ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయవలసిందిగా అధిష్టానం కోరడమైనది.

# నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయండి



మన గళండోన్ ప్రధాని నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలని గౌరవనీయులు డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి తెలియజేశారు.ఈ రోజు డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో డోన్ మండల మరియు పట్టణ కూటమి నాయకులు,బూత్,యూనిట్ క్లస్టర్ ఇంచార్జీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన నరేంద్ర మోడీ ఉమ్మడి కర్నూలు జిల్లాకు వస్తున్న సందర్భంగా మండలంలోని కూటమి నాయకులు మరియు కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.



# ప్రజా సమస్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించండి

– జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్




మనగళం, నంద్యాల : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంతృప్తి స్థాయిలో వేగవంతంగా, నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును జవాబుదారీతనంతో పరిష్కరించాలన్నారు. పి జి ఆర్ ఎస్ అర్జీలతోపాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఆర్జీలు క్లియర్ చేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని, పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా నిర్దిష్ట కాల పరిమితిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

తల్లికి వందనం వర్తింపజేయండి

తన ముగ్గురు పిల్లలు.. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారని, తల్లికి వందనం పథకం కింద నా అకౌంట్ కు డబ్బులు జమ కాలేదని నంద్యాల జిల్లా, మండలకేంద్రం డోన్ కు చెందిన రమీజా వినతి పత్రం అందజేశారు. నంద్యాల మండలం, కందికాయపల్లి గ్రామానికి చెందిన పి .వెంకటసుబ్బయ్య తనకు ముగ్గురు కుమారులు ఉన్నారన్నారు. ముగ్గురికి వివాహం అయిందని, రేషన్ కార్డు నుంచి డివైడ్ చేసి కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాలని డిఆర్ఓ కు అర్జీ సమర్పించారు. నంద్యాల మండలం, అంబులదిన్నె గ్రామానికి చెందిన ఎల్ బాల పోలయ్య, హౌసింగ్ పథకం కింద ఇల్లు మంజూరు అయిందని ఇంటి నిర్మాణానికి సంబంధించి బిల్లులు మంజూరు కాలేదని అర్జీ సమర్పించారు. రుద్రవరం మండలం, పెద్దకంబలూరు గ్రామానికి చెందిన కె .నారాయణరెడ్డి తనకు రేషన్ కార్డు మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ డీఆర్ఓ ఆదేశాలు జారీ చేశారు.

# ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేద్దామని పిలుపు



ఉమ్మడి కర్నూలు జిల్లాలో అక్టోబర్ 16న జరగనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కే ఈ శ్యామ్ కుమార్, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, బాబ్జి పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పత్తికొండ నియోజకవర్గానికి చెందిన ఐదు మండలాల టీడీపీ బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయి ఇంచార్జిలు, బీజేపీ, జనసేన పార్టీ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఆదినారాయణ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే ఈ శ్యామ్ కుమార్, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో పరిశ్రమలు, పెట్టుబడులు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రధానమంత్రి చేతుల మీదుగా వాటిని ప్రారంభించేందుకు ఈ సభను ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం జీఎస్టీ తగ్గింపు నిర్ణయం తీసుకుని రూ.2 లక్షల కోట్లు ఆదాయం కోల్పోయిందని, ఆ నిర్ణయం వెనుక ప్రజా హితం ఉన్నదని వివరించారు. జీఎస్టీ సంస్కరణల తర్వాత తొలిసారి ప్రధానమంత్రి ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తున్నారని పేర్కొన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు. పార్టీ అధిష్ఠానం నిర్దేశించిన లక్ష్యానికి మించి ప్రజా సమీకరణ జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షా ప్రభావం తో నష్టపోయిన చేనేత కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని చేనేత కార్మిక సంఘం డిమాండ్



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో వర్షా ప్రభావం తో నష్టపోయిన చేనేత కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో. చేనేత రాష్ట్ర అధ్యక్షులు కామర్తి రాజు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న. సిఐటియు మండల కార్యదర్శి గఫర్ మియా. సిఐటియు అధ్యక్షులు జిపి వీరన్న నష్టపోయిన చేనేత కుటుంబాలతో కలిసి ఈరోజు కోడుమూరు తాసిల్దార్ ఆఫీసులో వీఆర్వో. రేష్మ మేడమ్ గారికి చేనేత కార్మికుల సాధక బాధకాలు వివరించి భారీ వర్షా ప్రభావం వల్ల రెండు నెలల నుంచి చేనేత కార్మికులు పనులు కోల్పోయి పట్టు. నూలు. జరీ. చీరలు డామేజ్ కావడం ఒక్కొక్క కుటుంబానికి ఒక్క లక్ష రూపాయల నుంచి. 50 వేల 30 వేల వరకు నష్టం వాటిల్లిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు కావున అధికారులు స్పందించి చేనేత కుటుంబాలను నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారన్నారు కార్మికులకు పూచీకత్తులు లేకుండా రెండు లక్షల రూపాయలు బ్యాంకు రుణాలు పూరి గుడిసెల్లో ఉన్నవారికి బాడుగ ఇండ్లలో ఉన్న వారికి ఇంటి స్థలాలతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని 50 సంవత్సరాలకే పెన్షన్ అన్నారు 50 సంవత్సరాలు వయస్సు పైబడిన వారు చేనేత కుటుంబాల్లో చాలామంది ఉన్నారు వారికి కొత్త పెన్షన్లు ఇచ్చి చేనేత ముడి సరుకులపై జిఎస్టి ని ఎత్తివేయాలని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వినతి పత్రం సమర్పించడం అయినది ఈ కార్యక్రమంలో. బుడ్డప్ప. రాఘవేంద్ర. కుమారు మరియు చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు

# ఏఐఎస్ఎఫ్ బస్సుజాత పోస్టర్లు విడుదల



మనగళం, నంద్యాల : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 22 నుండి నవంబర్ 12 వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న బస్సు జాత పోస్టర్లను సోమవారం నంద్యాల పట్టణంలో సీపీఐ కార్యాలయం స్వామి రెడ్డి భవనం నందు నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ. కుల్లాయి స్వామి మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు రూ. 6,400 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పిపిపి విధానాన్ని రద్దు చేయాలన్నారు. వంద రోజుల్లో 107, 108, 77 జీవోలు రద్దు చేస్తామని ఇచ్చిన హామీని మంత్రి లోకేష్ విస్మరించడం తగదని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, నంద్యాల జిల్లాలో అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రద్దుచేసి, ఏ విశ్వవిద్యాలయానికి సంబంధించి ఆ విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ బస్సు యాత్రలో భాగంగా నంద్యాల పట్టణంలో 8వ తేదీ జరిగే బహిరంగ సభకు వేలాదిగా విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్, ఉపాధ్యక్షులు ఉదయ్, సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, జిల్లా నాయకులు శశి, ప్రవీణ్, చందు, మనోజ్, మతేష్, చోటు సునీల్, మాబాషా, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# సున్నిపెంటలో హెలీప్యాడ్ గ్రౌండ్ను పరిశీలించిన ఎమ్మెల్యే





మనగళం శ్రీశైలం : ప్రధాని శ్రీశైలం పర్యటన సందర్భంగా సున్నిపెంటలో హెలీప్యాడ్ గ్రౌండ్స్ను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి సోమవారం పరిశీలించారు. సీఎం పర్యటనల ఇన్చార్జి పెందుర్తి వెంకటేష్, జిల్లా అధికారులతో కలిసి ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లన్నీ పకడ్బందీగా చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

# ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్ల పై మంత్రుల సమీక్ష



మనగళం, కర్నూలు సిటీ : ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 16న కర్నూలులో పర్యటిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లపై రాష్ట్ర పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, ఆర్థిక శాఖ పయ్యావుల కేశవ్, రాష్ట్ర రెవెన్యూ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమీక్షించారు. నన్నూరు రాగమయూరి గ్రీన్ హిల్స్ వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలో ప్రధాని ఏర్పాట్లపై చర్చించారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, అనంతపురం ఎంఎల్ఏ దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వర రావు, కనిగిరి ఎమ్మెల్యే నరసింహ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ఛైర్మన్గా (ఏపీఐఐసీ) మంతెన రామరాజు, తదితరులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రధాని బహిరంగ సభను చారిత్రాత్మక విజయంగా మారుద్దాం: మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి



మన గళం కోడుమూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈనెల 16వ తేదీన నంద్యాల రోడ్లో గల రాగ మయూరి గ్రౌండ్ వద్ద నిర్వహించనున్న బహిరంగ సభను చారిత్రాత్మక విజయంగా మారుద్దామని కోడుమూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒకరితో ఒకరు కలిసి అందరూ ఈ సభకు విరివిగా వచ్చి మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కోడుమూరు పట్టణ టిడిపి అధ్యక్షులు గంగాధర్ నాయుడు మాట్లాడుతూ బూత్ ఇన్చార్జిలు బూతు కన్వీనర్లు ప్లాస్టర్ ఇన్చార్జిలు ప్రతి ఒక్కరు గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు క్రియాశీలకంగా పనిచేసే విజయవంతం చేయాలని అన్నారు కూటమి ప్రభుత్వంలో జిఎస్టి పైన తగ్గింపు తో కూటమి ప్రభుత్వంపై ప్రజా ఆదరణ పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి శ్రేణులు కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు

మా కలం.. మీ గళం..
మనగళం
దిన పత్రిక

# నారావారి నకిలీ మద్యంతో అమాయక ప్రజలు బలి కోడుమూరులో నకిలీ మద్యంపై వైయస్ఆర్‌సీపీ పోరుబాట






మన గళం కోడుమూరు: నారావారి నకిలీ మద్యంతో అమాయక ప్రజల ప్రాణాలు బలి తీసుకుంటున్నారని వైయస్ఆర్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ మండిపడ్డారు. నకిలీ మద్యం తయారీని ఒక పరిశ్రమలా మార్చి, దానిని రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేస్తూ, ప్రజల ప్రాణాలు హరిస్తున్న టీడీపీ నాయకుల వైఖరి, కూటమి ప్రభుత్వ మద్యం విధానాలకు వ్యతిరేకంగా సోమవారం వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో పోరుబాట చేపట్టారు. పార్టీ ఎస్ఈసీ సభ్యులు, మాజీ కుడా చైర్మన్, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోడుమూరు పట్టణంలో భారీ ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టి, ఎక్సైజ్ శాఖ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. అనంతరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు వైఎస్ఆర్‌సీపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ.. వైఎస్ఆర్‌సీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలకు మద్యాన్ని దూరం చేసి వారి ఆరోగ్యాన్ని వైఎస్ జగన్ కాపాడారని తెలిపారు. ఏపీలో 43వేల బెల్ట్ షాపులు తొలగించిన ఘనత వైఎస్ జగన్‌దే అన్నారు. మద్యం దుకాణాలను మూసేశారని గుర్తు చేశారు. ఇవాళ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ఊర్లోను బెల్ట్‌షాపులు వెలిశాయన్నారు.రాష్ట్రాన్ని దోచుకోవడానికే ఈ నారా వారి కూటమి పని చేస్తుందని విమర్శించారు. కల్తీ మద్యం తయారు చేసి బెల్ట్ షాపులు, బార్లు, పర్మిట్ రూము ద్వారా ప్రజల వద్దకు చేరుస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ఈ కల్తీ మద్యం, గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా పెరిగిపోయాయని దుయ్యబట్టారు. వీటివల్ల మహిళల మాన, ప్రాణాలకి హాని కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏడాదిలో 21 శాతం గంజాయి డ్రగ్స్ అక్రమ మద్యం కేసులు పెరిగాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక వైయస్ఆర్‌సీపీ పార్టీ శ్రేణులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం







మనగళం శ్రీశైలం : శ్రీశైల దేవస్థానానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ధర్మకర్తలమండలిని నియామకం చేసింది.ఈ మేరకు రాష్ట్రపభుత్వం జీ.ఓ. ఆర్‌టినెం. 1237, తేది: 10.10.2025 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. తదనుగుణంగా దేవదాయశాఖ కమిషనర్ వారు జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి నూతన ధర్మకర్తల మండలి చేత ఈ రోజు (13.10.2025) ఉదయం అసిస్టెంట్ కమిషనర్ మరియు సహాయ కార్యనిర్వహణాధికారి ఇ. చంద్రశేఖరరెడ్డి పదవీ ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమశాఖ గౌరవ మంత్రివర్యులు శ్రీ సత్యకుమార్ యాదవ్, ఆదోని నియోజకవర్గ గౌరవ శాసనసభ్యులు డా. వి. పార్థసారధి విచ్చేశారు. చంద్రవతి కల్యాణమండపంలో జరిగిన ఈ ప్రమాణస్వీకార కార్యక్రమములో నియామకం కాబడిన అధ్యక్షులను మరియు సభ్యులను దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ మరియు సహాయ కార్యనిర్వహణాధికారి వారు ముందుగా స్వాగతించారు. అనంతరం అధ్యక్షులుగా నియామకం కాబడిన శ్రీ పి. రమేష్‌నాయుడు ముందుగా ప్రమాణస్వీకారం చేశారు. తరువాత సభ్యులు వరుసగా, శ్రీ ఏ.వి. రమణ, శ్రీమతి బి. రవణమ్మ, శ్రీ జి. లక్ష్మీశ్వరి, శ్రీమతి కె. కాంతివర్ధిని, శ్రీ ఎస్. పిచ్చయ్య, శ్రీ జె. రేఖాగౌడ్, శ్రీ ఎ. అనిల్‌కుమార్, శ్రీ డి. వెంకటేశ్వర్లు, శ్రీ బి. వెంకటసుబ్బారావు, శ్రీ సి.హెచ్. కాశీనాథ్, శ్రీ యం. మురళీధర్, శ్రీమతి యు. సుబ్బలక్ష్మీ, శ్రీమతి పి.యు. శివమ్మ, శ్రీమతి జి.శ్రీదేవివారి చేత అసిస్టెంట్ కమీషనర్ మరియు సహాయ కార్యనిర్వహణాధికారి వారు ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా ధర్మకర్తలమండలిలో ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించబడిన పలువురు సభ్యులు కూడా ఈ కార్యక్రమానికి విచ్చేశారు. అనంతరం సభ్యులందరికీ వేదాశీర్వచనముతో పాటు శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలు మరియు జ్ఞాపిక అందజేయబడ్డాయి. ఈ సత్కార కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి పాల్గొన్నారు. కార్యక్రమములో పలువురు దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రధాని మోడీ బహిరంగ సభకు తరలిరావాలి



మనగళం, కర్నూలు సిటీ : ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 16వ తేదీన కర్నూలు పర్యటిస్తున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు ప్రతిఒక్కరూ తరలిరావాలని బీజేపీ నాయకురాలు మనోహరి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆమె బీజేపీ మహిళా కార్యకర్తలతో కలిసి వెంకటరమణ కాలనీలో పర్యటించారు. మహిళలను కలసి ప్రధాని పర్యటన వివరాలను తెలిపారు. సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ పై ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తారని ఆమె మహిళలకు వివరించారు. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా మనోహరి పిలుపునిచ్చారు.

## తులం ఏ రూ.1.30 లక్షలు.. ఈ ఏడాది 50శాతం పెరిగిన ధరలు



మనగళం : బంగారం ధరలు ఆల్‌టైమ్ హైకి చేరాయి. ఇప్పటికే కనీవినీ ఎరుగని రీతిలో రాకెట్ వేగంతో దూసుకెళ్తున్న పుత్తడి ధర తాజాగా మళ్లీ పెరిగింది. తులం బంగారం రూ.1.30 లక్షలకు చేరువైంది. బంగారంతోపాటూ వెండి కూడా ఆకాశాన్ని తాకుతోంది. ఏకంగా రూ.2లక్షలకు చేరువైంది. మార్కెట్ వర్గాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఇవాళ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,28,110గా ఉంది. అదే 22 క్యారెట్ల పది గ్రాముల పుత్తడి ధర రూ.1,18,630గా నమోదైంది. ఇక హైదరాబాద్‌లో కిలో వెండి 1,83,000కి చేరింది. 2025లో బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 50 శాతానికి పైగానే ధరలు పెరిగాయి. 2022తో పోలిస్తే మొత్తం పెరుగుదల 140 శాతానికి చేరుకుంది. 2026 ప్రారంభం నాటికి 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.1.50 వేలకు చేరే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతివిలువైన లోహాల ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతుండటం వల్లనే దేశీయంగా బంగారం ధరలు గరిష్ట స్థాయికి చేరుతున్నాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోతుండటం, అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్, రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు, ఫెడరల్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించనుండటం, చైనా-అమెరికా మధ్య టారిఫ్‌లు కూడా ధరలు దూసుకుపోవడానికి ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నాయి. మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం కూడా ఓ కారణంగా చెబుతున్నారు.



# ప్రధాని ప్రోగ్రాం విజయవంతం చేద్దాం: శ్రీశైలం ఎమ్మెల్యే

మనగళం శ్రీశైలం : ప్రధాని మోదీ శ్రీశైలం పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పిలుపునిచ్చారు. విద్యుత్ కళాభారతిలో టీడీపీ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ నుంచి పెద్ద ఎత్తున ప్రజలందరూ పాల్గొనాలని పేర్కొన్నారు. సీఎం సంకల్పంతో ప్రధాని పర్యటన అనంతరం శ్రీశైలం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వై.యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## ప్రధాని పర్యటనకు కట్టుదిట్టంగా భద్రత

- 7,500 మంది పోలీసులతో బందోబస్తు
- 200 సీసీ కెమెరాలతో గట్టి నిఘా
- డ్రోన్ల ఎగురవేత 16 వ తేదీ వరకు నిషేధం
- జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్





మనగళం, కర్నూలు క్రైం : కర్నూలులో ఈ నెల 16 వ తేదీన ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో పకడ్బందీ భద్రతా ఏర్పాట్ల చేస్తున్నామని జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం కర్నూలు, పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు సమీపంలో పసుపుల రోడ్డు లో ఉన్న యూబీఆర్ కన్వేన్షన్ హాల్ లో బందోబస్తు నిమిత్తం విచ్చేసిన పోలీసు అధికారులతో ఎస్పీ సమావేశమయ్యారు. పార్కింగ్ ప్రదేశాలు, బహిరంగ ప్రదేశం, రూట్ డైవర్షన్స్ గురించి వివరిస్తూ జియో గ్రాఫికల్ మ్యాప్ ను చూపిస్తూ ఎస్పీ సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ స్ధాయి నుండి ఎస్సై ర్యాంకు అధికారులు ఆయా సెక్టార్ ఇంచార్జ్ ఐపియస్ ల దగ్గర విధులు నిర్వహించాలన్నారు. బహిరంగ సభ ప్రదేశం దగ్గర 7 గురు ఎస్పీ స్థాయి అధికారులను కేటాయించామన్నారు. ప్రధాన మంత్రి బహిరంగ సభకు దగ్గరగా ఉన్నప్పుడు గాని, బహిరంగ సభ నుండి వచ్చే, వెళ్లే సమయంలో బందోబస్తు విధులు నిర్వహించే పోలీసులు ఫొటోలు, విడియోలు తీయరాదన్నారు. డీజీపీ కంట్రోల్ రూమ్ నుండి సీసీ కెమెరాల నిఘా ఉంటుందన్నారు. సుమారు 7,500 మంది పోలీసులను బందోబస్తు విధులకు కేటాయించామన్నారు. ఎయిర్ పోర్టు దగ్గర , బహిరంగ సభ, పబ్లిక్ గ్యాలరీలు , పార్కింగ్ ప్రాంతాల దగ్గర అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానితులు కన్పిస్తే వెంటనే పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల నుండి 7 వేల బస్సులలో ప్రజలు బహిరంగ సభకు వస్తారన్నారు. ఇందులో 3 వేల బస్సులు ఆర్ టి సి కి చెందినవి , 4 వేల ప్రవేట్ బస్సులలో ప్రజలు ప్రధానమంత్రి బహిరంగ వస్తారన్నారు. ప్రధాన మంత్రి పర్యటన ప్రాంతాలలో మంగళవారం నుంచి గురువారం వరకు డ్రోన్ ల ఎగరవేత నిషేధించామని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో ఆయా జిల్లాల నుండి వచ్చిన ట్రైనీ ఐపియస్ లు, అడిషనల్ ఎస్పీలు, డిఎస్పీలు, సిఐలు, ఆర్ ఐలు ఎస్సైలు పాల్గొన్నారు.

# జీ ఎస్ టీ తగ్గింపుతో ప్రజల్లో ఆనందం

- ప్రధాని మోదీ రాకతో ఊపందుకోనున్న పారిశ్రామిక ప్రగతి
- జన సమీకరణకు" కూటమి" శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలి
- మంత్రి ఎన్ఎండి ఫరూక్



మనగళం, నంద్యాల : ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం జీ ఎస్ టీ తగ్గించడంతో అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం నెలకొని ఉందని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. నంద్యాల జిల్లా శ్రీశైలం క్షేత్ర సందర్శన, కర్నూలు జిల్లా నన్నూరు వద్ద భారీ బహిరంగ సభ ప్రధాని నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో బహిరంగ సభకు జన సమీకరణ పై సన్నాహక సమావేశం సోమవారం జరిగింది. రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అధ్యక్షతన, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ నేతృత్వంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తో జన సమీకరణ ఏర్పాట్లపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. నంద్యాల పట్టణంలోని ఎన్టీఆర్ మున్సిపల్ టౌన్ హాల్ లో జరిగిన సమావేశానికి పరిశీలకులుగా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, నంద్యాల అసెంబ్లీ టిడిపి పరిశీలకుడు ఆలం నరస నాయుడు హాజరయ్యారు. తెలుగుదేశం,బిజెపి, జనసేన పార్టీల బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయి ఇన్చార్జిలు,నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రసంగించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన విజయవంతం కోసం భారీగా జన సమీకరణ చేస్తున్నట్లు వెల్లడించారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 25,000 మందికి పైగా జన సమీకరణ కోసం నంద్యాల మున్సిపాలిటీలోని వార్డుల వారీగా,నంద్యాల మండలం, గోసుపాడు మండలాల్లోని అన్ని గ్రామాల వారీగా ప్రత్యేకంగా బస్సులు, వాహనాలు కేటాయింపు, భోజన సౌకర్యం, సభా స్థలం వద్దకు చేరిక, తిరిగి అక్కడినుండి సొంత ప్రాంతాలకు చేరవేత పై అన్ని మౌలిక సదుపాయాలతో ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. కూటమి పార్టీల నాయకులు సమన్వయంతో ప్రధాని పర్యటన ను విజయవంతం చేయాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు.

సొంత కుటుంబం కార్యక్రమంలా భావించాలి

నంద్యాల నుంచి భారీగా జన సమీకరణ చేపట్టి ప్రధాని పర్యటన విజయవంతం చేయాలని నియోజకవర్గ జన సమీకరణ ఏర్పాట్ల ప్రత్యేక పరిశీలకులు పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు,శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, టిడిపి నియోజకవర్గ పరిశీలకుడు ఆలం నరస నాయుడు లు పిలుపునిచ్చారు. సన్నాహక సమావేశంలో జన సమీకరణ పై కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి వారు ప్రసంగించారు. పట్టణంలో వార్డుల వారీగా,గ్రామాల వారీగా ఎన్ని బస్సులు, ఏ టైంలో ప్రారంభమవుతాయనే విషయంలో అధికారులు ఏర్పాటు చేస్తున్నారని, అధికారుల క్షేత్రస్థాయి ఏర్పాట్లకు కూటమి పార్టీలోని మనమంతా నిలబడాలని సూచించారు. ఎవరు పిలిచినా పిలవకపోయినా ఇది మన సొంత కుటుంబాల్లోని కార్యక్రమంగా భావించి కూటమి కార్యకర్తలు నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. నంద్యాల నియోజకవర్గం నుంచి కూటమి పార్టీ నేతలు, గ్రామాలు వారిగా టార్గెట్ పెట్టుకుని జన సమీకరణ చేయాలని పేర్కొన్నారు. ప్రధాని మోదీ పర్యటనకు క్షేత్రస్థాయి ప్రజల నుంచి కూడా ఊహించని స్పందన, అందుకు తగ్గట్లుగా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కూటమి కార్యకర్తలపై ఉందన్నారు. ప్రధాని సభకు తరలి వచ్చే మహిళలు,యువత, వృద్ధులకు తగిన విధంగా రవాణా,ఆహార ఏర్పాట్లు,రవాణా, ఆహారం, తాగునీరు వంటి సదుపాయాలు విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జన సమీకరణ ఏర్పాట్లపై కూటమికి చెందిన పలువురు ముఖ్య నాయకులు ప్రసంగించారు. నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్ లో జరిగిన ప్రధాని మోదీ పర్యటన సభ విజయవంతం కోసం సన్నాహక సమావేశానికి మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రారావు, ఏవిఆర్ ప్రసాద్, మార్కుఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి,మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు,బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఇంటి ఆదినారాయణ, కశెట్టి కృష్ణమూర్తి,జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పిడతల సుధాకర్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మనీయార్ ఖలీల్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దస్తగిరి,కూటమి పార్టీల ముఖ్యనాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.




Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310